క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: ప్రమాదాలను నివారించేందుకు వాహనాదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాదారులు వాహనాలకు సంబంధించిన పేపర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్ తదితర చలాన్లను వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. తనిఖీల్లో ఏఎస్ఐ అంజయ్య, కానిస్టేబుళ్లు యాదగిరి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో దానగళ్ల ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన పాలాది శ్రీనివాస్ రూ.5వేల చొప్పున, గ్రామ మాజీ సర్పంచ్ కమ్లేకర్ నవీన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్ రూ.4వేల చొప్పున, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్ రూ.2వేల నగదును శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో నరేశ్‌యాదవ్, జగన్‌రెడ్డి, లక్ష్మయ్య, కృష్ణ, అంజనేయులు, బాలయ్యగౌడ్, విజయ్, కృష్ణ, బాలు, శంకర్, దానగళ్ల మహేశ్, శ్రీకాంత్, రాజు, చరణ్, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



బాధితులకు ఎల్‌ఓసీ మంజూరుపత్రాన్ని అందజేస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. షాబాద్‌కు చెందిన కమ్మరి మనోహర్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు బాధితుడికి మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌ఓసీని ఆయన అందజేశారు. అదేవిధంగా చేవెళ్ల మండల పరిధిలోని గొల్లగూడకు చెందిన మోతె రామకోటికి రూ.50వేలు, పూడూరు మండలం కెరివెళ్లికి చెందిన తుమ్మపల్లి రాఘవేందర్‌కు రూ.50వేలు, శివకుమార్‌కు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయన అందజేశారు.

అక్రమంగా ఆవులను తరలిస్తే సమాచారం అందించండి

చేవెళ్ల: రాబోయే బక్రీద్ పండుగకు ఎవరైనా అక్రమంగా ఆవులు, ఎద్దులు, దూడలను తరలిస్తున్నట్లు ప్రజలకు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని పట్టణ పోలీస్ అధికారులు సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్ఐలు శిరీష, సంతోష్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా పశువుల తరలింపు విషయాలు ఎవరికైనా తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. సీఐ ఫోన్ నం.9440627356, ఎస్ఐలు 8712663441, 8712663442, పోలీస్‌స్టేషన్ నం.7901099443లకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. అక్రమంగా పశువుల రవాణా నేరమని, దీనిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీరనున్న ప్రయాణికుల ప్రయాస

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.184 కోట్లు మంజూరు

- పరిపాలనా అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- ఫలించిన ఎమ్మెల్యే కృషి
- హర్షం వక్తం చేస్తున్న వాహనదారులు



చటాన్‌పల్లి రైల్వేగేటు వద్ద నిలిచిన వాహనాలు

షాద్‌నగర్: రైళ్ల రాకపోకలతో ప్రయాణికులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మాటిమాటికి గేటు వేస్తుండటంతో వాహనాలు తరచూ గేటు వద్ద ఆగిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు అవస్థలు పడటంతో పాటుగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. గతంలో అర్ధంతరంగా ఆగిపోయిన పనులతో ప్రజలు అయోమయంలో పడ్డారు. ఎట్టకేలకు ఏళ్లుగా ఎదురుచూస్తున్న పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన కృషి ఫలించింది.

పాత డిజైన్ ప్రకారమే..

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.184కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.89కోట్లు ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ డిజైన్ మార్చడంతో ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం పాత డిజైన్ ప్రకారమే వై ఆకారంలో బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటుగా పరిపాలన అనుమతులు జారీ చేసింది.

తొలగనున్న ఇబ్బందులు

షాద్‌నగర్ మీదుగా ప్రతీ రోజు సుమారు ఇరవై రైళ్లు వచ్చిపోతుంటాయి. పట్టణంలోని చటాన్‌పల్లి, కేశంపేట రోడ్డులో రైల్వే గేట్లు ఉన్నాయి. చటాన్‌పల్లి రైల్వేగేటు మీదుగా చటాన్‌పల్లి, బీవీరావునగర్, బుచ్చిగూడ, కొండన్నగూడ, వెల్జర్ల, సంగెం, కొత్తపేటకు చెందిన వేలాదిమంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా వాహనదారులు జాతీయ రహదారి బైపాస్ నుంచి షాద్‌నగర్ పట్టణంలోని నుంచి వికారాబాద్, పరిగి వెళ్లాలన్నా చటాన్‌పల్లి రైల్వే గేటును దాటి రావాల్సి ఉంటుంది. దీంతో అనునిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ రహదారి ఎంతో రద్దీగా ఉంటుంది. తరచూ గేటు వేస్తుండటంతో వందల సంఖ్యలో వాహనాలు రైల్వే గేటు వద్ద ఆగిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితులలో గేట్లను దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గేటు తీసిన తర్వాత కూడా వాహనాలు అన్నీ ఒకేసారి ముందుకు కదులుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ సమస్యలు తొలగనున్నాయి.



ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే ప్రత్యేక కృషి

బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన అదనపు నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన కృషి ఫలిచింది. పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, మంత్రి కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్‌ఆండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశాలు నిర్వహించి చర్చించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

నేతల సంబురాలు

బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నిధులు మంజూరు చేయడంతో పాటుగా పరిపాలన అనుమతులు జారీ చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, చటాన్‌పల్లి, రాంనగర్ కాలనీవాసులు శనివారం సంబురాలు నిర్వహించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

> **ఆరునెలల్లో పనులు పూర్తి**
>
> 
>
> గత పాలకుల తప్పుడు నిర్ణయాలతో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులకు అవాంతరాలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.184కోట్లు మంజూరు చేసింది. ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి ప్రజల కలను సాకారం చేస్తాం.
>
> – వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



నూతన సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బీసీసేన నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జాతీయ బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని జాతీయ బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లిలో జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో బీసీసేన మహిళా విభాగం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ మహిళలకు పూర్తిస్థాయి స్వేచ్ఛ రాలేదని ఆరోపించారు. మహిళలకు ప్రోత్సాహం లేకపోవడంతో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమస్యలపై మహిళలందరూ చైతన్యవంతులు కావాలని, గ్రామ గ్రామాన మహిళా సమాజాన్ని ముందుకు నడిపించాలన్నారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా జాతీయ బీసీసేన అండగా ఉంటుందన్నారు. అనంతరం జాతీయ బీసీసేన ఎల్లంపల్లి మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా కందివనం లలిత, ఉపాధ్యక్షురాలిగా గూడెం సుగుణమ్మ, ప్రధాన కార్యదర్శిగా బోడంపాటి మాధవి, కార్యదర్శిగా గున్న లక్ష్మమ్మ, సహాయ కార్యదర్శిగా న్యాస నీలవేణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీసేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్, మండల మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు స్రవంతిరాజ్, కార్యదర్శి గుల్లె సరస్వతి, నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్‌పై రాష్ట్ర ప్రజలకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీలు నైతిక విలువలు కోల్పోయి రాష్ట్ర ముఖ్యమంత్రిని విమర్శించడం సరైంది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీని సీఎం రేవంత్‌రెడ్డి ఎనిమిది సార్లు కలిసినా బీఆర్ఎస్ నాయకులు తప్పుపట్టడం సిగ్గు చేటన్నారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి హైదరాబాద్‌కు దేశ ప్రధాని వచ్చినా కలవని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ముఖ్యమంత్రిని విమర్శించడం సరికాదన్నారు. అభివృద్ధికి సహకరించాల్సిన మాజీ ముఖ్యమంత్రి అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకోవడం ఇది సరైన ప్రతిపక్షమా అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మానుకోని ప్రజల్లోకి వచ్చి అసెంబ్లీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన డిమాండ్ చేశారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

భూసార పరీక్షలు తప్పనిసరి

జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు మాధవి, లీలారాణి

మొయినాబాద్: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించి వాటి ఆధారంగా పంటలు సాగుచేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు ఎ.మాధవి, పి.లీలారాణి అన్నారు. మండల పరిధిలోని చందానగర్‌లో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసార పరీక్షల ద్వారా నేల స్వభావాన్ని గుర్తించవచ్చన్నారు. అన్ని సీజన్‌లలో ఒకే రకమైన పంటను వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంభించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించేకోవాలని సూచించారు. నీటి వృథాను తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ విధానాలను పాటించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, పీహెచ్‌డీ విద్యార్థులు సాయి తరుణ్, నవ్య, ఏఈఓ సునీల్‌కుమార్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల విడుదలపై హర్షం

కొందుర్గు: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఇదివరకు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌లు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించిందన్నారు. అప్పట్లో బిల్లులు రాక సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, వారి పదవీ కాలం ముగిసినా పైసా ఇవ్వలేదని విమర్శించారు. ఇలాంటి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం అప్పటి సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామ్‌రెడ్డి, లింగంగౌడ్, నర్సింలు, పెంటయ్య, నాయకులు నరేందర్, యాదయ్య, రామయ్య, ప్రసాద్, రాజు, నర్సింలు, రవి, రఘు, కృష్ణయ్య, శ్రీను, మహిపాల్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

విద్యాబోధనలో సాంకేతికత అవసరం

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సూచించారు. శనివారం షాద్‌నగర్ ఢిల్లీ వరల్డ్ పాఠశాలల్లో జరుగుతున్న మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 5వ రోజు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోధనలో వినూత్న పద్ధతులు, సాంకేతికత ఎంతో అవసరమన్నారు. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు నాణమైన విద్య అందించాలన్నారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ అందించినట్లు తెలిపారు. ఐదురోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న విద్యావిధానంలో కొత్త మెలకువలతో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. శిక్షణ తరగతుల్లో ఎఫ్ఎల్ఎన్, మూల్యాంకనం, కనీస అభ్యాసన సామర్థ్యాలు, సులభంగా గణితం నేర్చుకోవడం తదితర అంశాలపై శిక్షణ అందించినట్లు వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబాధన మెరుగుపరచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణ, అంజయ్య, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్ రమణ, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



షాద్‌నగర్: లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన పాలకులు ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు పూర్తి కట్టుబడి ఉండి ముందుకు సాగుతోందన్నారు. పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, చెన్నయ్య, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, జమ్రుద్‌ఖాన్, నడికూడ సరిత, యాదగిరియాదవ్, బస్వం, ముబారక్, వెంకటేశ్, విజయ్, శ్రీను, మహేందర్, అర్జున్ లక్ష్మణ్, భాస్కర్, చంద్రకళ, సుశీల, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ, సంఘీగూడ గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలో సోలార్ లైట్లు

మేకగూడ శివారులోని మైక్రోసాఫ్ట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు, సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా మహిళల స్వయం ఉపాధి కోసం పరిశ్రమ ఇచ్చిన కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, జానేశ్వర్, సుక్యానాయక్, కొమ్ము కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల సేవలు అభినందనీయం

కొత్తూరు: సామాజిక సేవకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్‌వే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. సెంటర్‌లో నిరుద్యోగులు, విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఎమ్మెల్యేకు వివరించారు. సామాజిక సేవకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో సంస్థలు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో సంస్థ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభలో పాల్గొని గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గ్రామంలో పలువురు నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో నాయకులు ఆగీరు రవికుమార్, శేఖర్‌గుప్తా, బాబు, బల్వంత్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు రేఖ, భూషన్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు

అభివృద్ధి చేయాలంటూ స్థానికుల ధర్నా



రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేస్తున్న ఫౌండేషన్ నాయకులు

శంకర్‌పల్లి: పట్టణ చౌరస్తా నుంచి ఫత్తేపూర్ వరకు నిలిచిన నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గుంతల రోడ్డుపై బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల, వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఎన్నో ఏళ్లుగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా, మధ్యలోనే వదిలేశారని, వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందిచాలని, లేకపోతే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ధర్నాలో ఫౌండేషన్ కార్యదర్శి వేణేంద్రచారి, సభ్యులు మహేదర్‌రెడ్డి, రాజు, రవి, గంగాధర్, బస్వరాజ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాయకస్వామి కల్యాణం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో గల శ్రీగోదారంగనాయకస్వామి దేవాలయ ఆలయ ధర్మకర్తలు పురుషోత్తమాచార్యులు, రాజగోపాల్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరంగనాయకస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోదారంగనాయకస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



మహోత్సవానికి హాజరైన భక్తులు